వైద్యులకు రక్షణ కల్పించాలి



ఎంతో పవిత్రమైన వైద్య వృత్తిని ఎంచుకున్న యువతిని అత్యంత పాశవికంగా చంపడం దుర్మార్గం. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. పట్టణం, నగరాల్లో పనిచేస్తున్న వైద్యులకు రక్షణ లేకుంటే గ్రామాల్లో పనిచేస్తున్న వైద్యుల సంగతి ఏమిటి. మహిళలు ఆస్పత్రుల్లో విధులు నిర్వహించాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. వైద్యులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

–డాక్టర్ ప్రవీణ్ మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, లద్దిగం

భద్రత ముఖ్యం



ఆస్పత్రుల్లో రోగుల సేవల కోసం 24 గంటలు పనిచేసే తమకు మానసిక ప్రశాంతత చాలా అవసరం. ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు తగిన భద్రత చాలా అవసరం. కోల్‌కతా సంఘటన జరిగాక వైద్యులకు చాలా భయమేస్తోంది. ప్రభుత్వాలు దీనిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ సాయికిశోర్, పలమనేరు



పోలీసుల భద్రత ఉండాలి..



ఆస్పత్రుల్లో రాత్రి సమయంలోనూ వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉంటాం. ఏదేనీ ఎంఎల్‌సీ కేసు వస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలపాలి. ఆపరేషన్ కేసులొస్తే రాత్రుల్లో గైనకాలజిస్టులు ఆస్పత్రికి రావాలి. ఆస్పత్రిలో ఏ సంఘటన జరిగినా మాకెవరు రక్షణగా ఉంటారు. అందుకే ఆస్పత్రిలో తప్పకుండా పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఏర్పాటు చేయాలి.

–డా. శారద, ఆర్ఎంఓ, పలమనేరు

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



సుబ్బారెడ్డి

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఎస్ఐగా సుబ్బారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సుకుమార్ సెలవులో వెళ్లడంతో పుంగనూరులో పనిచేస్తున్న ఎస్ఐ సుబ్బారెడ్డిని రొంపిచెర్లకు బదిలీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ చట్టం అందరికి సమానమేన్నారు. పేకాట, జూదం, ఎర్రచందనం అక్రమ రవాణా వంటి వాటిపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు రహస్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు న్యాయం కోసం 24 గంటలు ఎప్పుడైనా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావచ్చని ఆయన తెలిపారు.

హుండీ ఆదాయం రూ.1.99 లక్షలు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో రూ.1.99 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఏఈఓ మునికృష్ణారెడ్డి తెలిపారు. నగదును ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆపరేషన్‌తో కంటి చూపు కాపాడుకోండి



వైద్యశిబిరంలో ప్రసంగిస్తున్న కలెక్టర్

కుప్పం: కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న కంటి రోగులు భయపడకుండా ఆపరేషన్ చేసుకుని కంటిచూపును కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. గురువారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే జరిపి కంటి రోగులకు గుర్తించామన్నారు. సెప్టెంబర్ 3 తేదీ వరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత ఆపరేషన్లు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ వినతులు స్వీకరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, ఆర్డీఓ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో క్రీడా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ బాబు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.బాబు క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఇందులో ఇన్‌చార్జ్ పీఈటీ సుబ్బయ్యనాయుడు, పీడీ విక్రమ్ రాజ్ పాల్గొన్నారు.

వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

పలమనేరు: పట్టణంలోని సెబ్ అధికారులు గతంలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను స్థానిక కార్యాలయం వద్ద గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఇందుకు సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా 23 వాహనాలను వేలం వేయగా ప్రభుత్వానికి రూ.3.82లక్షల ఆదాయం వచ్చినట్లు స్థానిక సెబ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు.

రేపే పింఛన్ల పంపిణీ

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 31నే సామాజిక పింఛన్లను సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయనున్నట్టు స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు ఇంటివద్దకే వచ్చి అందించనున్నట్టు అందులో తెలిపారు.

ఊరంతా ఈగల మోత..!

- కోళ్లఫారాల దుర్వాసనతో బెంబేలెత్తుతున్న పల్లెలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- కోళ్లఫారం వ్యర్థాలతో సమస్య
- పట్టించుకోని అధికార యంత్రాంగం



యల్లంపల్లెలో ఈగల బెడద నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫ్లై టేప్‌కు అతుక్కుపోయిన ఈగలు

చౌడేపల్లె: కోళ్లఫారాల దుర్వాసన మూలాన ఈగల మోతతో పల్లెలు బెంబేలెత్తుతున్నాయి. అంటువ్యాధులతో పాటు శ్వాసకోశ సమస్యలు తలెత్తి ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. మండలంలోని కాగతి పంచాయతీ యనమచామనపల్లె సమీపంలో ప్రీమియర్ పౌల్ట్రీ ఫామ్‌ను సుమారు లక్ష పిల్లల సామర్థ్యంతో నిర్మించారు. షెడ్లలోని కోళ్ల వ్యర్థాలను ఒక చోట డంప్ చేసి, వాటిని డివాటరింగ్ సిస్టం ద్వారా వేరు చేసిన వ్యర్థపు ఎరువుగల నీటిని ప్రత్యేక ట్యాంకర్లతో తమ పొలాలకు వినియోగిస్తున్నారు. గ్రామాలకు సమీపంలోని మామిడితోటలకు ఈనీటిని సరఫరా చేస్తుండడంతో ఆ ప్రాంతం దుర్వాసన చిమ్ముతోంది. పొలాల్లోకి ఆవులు మేతకు సైతం వెళ్లలేని పరిస్థితి. ఇక పర్యావరణం సమస్యలనూ తెచ్చి పెడుతోంది. ఈ కోళ్ల పెంట దుర్గంధం వలన ఈగల మోత పెరిగింది. యల్లంపల్లె, కాగతి, యనమచానపల్లె, అన్నిపల్లె, పొన్నిపెంట తదితర గ్రామాల్లో ఎటుచూసినా ఇళ్ల వద్ద ఈగలు చుట్టుముట్టేస్తున్నాయి. అధికారుల దృష్టికి ఈ సమస్యలను నివేదించినా పట్టించుకోకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఈగల బెడద భరించలేక గ్రామస్తులు ఫ్లై టేప్‌ల (ఈగల నిర్మూలనకు వాడేవి)ను ఇళ్ల వద్ద ఉంచుకుంటున్నారు. ఇది తెలుసుకున్న మీడియా అక్కడికి వెళ్లడంతో కోళ్లఫారం నిర్వాహకులు ఈగల నివారణకు తాత్కాలికంగా మందులు పిచికారీ చేయడం మినహా మరే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెప్పారు.





మందును పిచికారీ చేస్తున్న దృశ్యం, ఇంటిముందు నీటితొట్టి చుట్టూ ఈగల గుంపు



వ్యర్థాలను మామిడి తోటలకు ట్యాంకుతో సరఫరా చేస్తున్న దృశ్యం

దుర్వాసన భరించలేకున్నాం



దుర్వాసనతో భరించలేకున్నాం. అన్నం తినాలన్నా తినలేకపోతున్నా. తిన్న వెంటనే వాసనకు వాంతులు చేసుకోవాల్సిన పరిస్థితి కలుగుతోంది. చిన్నపిల్లలు పడుతున్న ఇబ్బందులు చెప్పలేం. గ్రామ సమీపంలో వ్యర్థాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. ఇకనైనా అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలి.

–సుదర్శన్, రైతు, యల్లంపల్లె

ఈగలతో చాలా ఇబ్బంది



వాసన ఓవైపు ఈగల బెడద మరోవైపుతో చాలా ఇబ్బందిగా ఉంది. ఇంటి లోపల బయట కూడా ఈగలు గుంపులు గుంపులుగా వాలిపోతున్నాయి. మందులు పిచికారీ ఫలితం లేదు. వంటలు చేస్తుంటే వాటిల్లో కూడా పడిపోతున్నాయి. చాలా ఇబ్బందికరంగా ఉంది.

–విజయకుమారి, గృహిణి, యల్లంపల్లె

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



చంద్రమాకులపల్లెలో మెడల్స్ సాధించిన విద్యార్థులు

పుంగనూరు: జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కల్లూరు హెచ్ఎం శ్రీవాణి కోరారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెలో హెచ్ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో క్రీడాదినోత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

కుప్పంరూరల్: హాకీ క్రీడా దిగ్గజం ధ్యాన్‌చంద్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని చందం ఉన్నత పాఠశాల హెచ్ఎం మార్కొండనాయుడు అన్నారు. గురువారం ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా పేర్కొన్నారు.



పులిచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల ర్యాలీ

హాకీలో భారతదేశానికి 9 ఒలింపిక్ గోల్డ్ మెడల్స్ సాధించిపెట్టిన గొప్ప క్రీడాకారుడిగా ధ్యాన్‌చంద్‌ను అభివర్ణించారు. విద్యార్థులకు పరుగు పందేలు, ఖోఖో క్రీడలు నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ధ్యాన్‌చంద్ గొప్పతనాన్ని చాటి చెప్పారు. అనంతరం తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో పాఠశాలకు రావడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కమనీయం.. వేణుగోపాలుని కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పలమనేరు: పట్టణంలోని పాతపేటలో వెలసిన సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం గురువారం రాత్రి కమనీయంగా జరిగింది. కార్యక్రమానికి పట్టణానికి చెందిన భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

- వైఎస్సార్‌సీపీ నేత ఓబులేసు

సాక్షి టాస్క్‌ఫోర్స్: న్యాయం కోసం ఎస్సీ కులానికి చెందిన ఓబులేసు నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మాక్‌వానాను ఆశ్రయించారు. బాధితుడి కథనం మేరకు వివరాలు.. రొంపిచెర్ల మండలం నగిరి దళితవాడకు చెందిన ఓబులేసు ఈనెల 18న మండల వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కోటా వెంకటరమణను టీడీపీ నేతలు నాగార్జున నాయుడు, ఎస్.నాగరాజ, సుధాకర్, మురళి, జలీల్ దాడిచేసి గాయపరిచారు. కిందపడిన ఓబులేసు వారి నుంచి తప్పించుకుని ద్విచక్రవాహనంలో పారిపోతుండగా జీపుతో ఢీకొట్టారు. దీంతో ఆయన కింద పడ్డారు. చుట్టుపక్కల వారు వచ్చి ఓబులేసును పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ తంతు రొంపిచెర్ల పోలీసులకు తెలిసినా పట్టించుకోలేదు. ఆలస్యంగా ఆస్పత్రికి వెళ్లి పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో తనకు న్యాయం చేయాలని బాధితుడు ఓబులేసు ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమీషన్ చైర్మన్‌ను కలసి ఫిర్యాదు చేశారు. ఓబులేసుకు న్యాయం చేయాలని చిత్తూరు జిల్లా ఎస్పీ, డీఎస్పీలను ఆదేశించారు. ఈ కేసును 307 సెక్షన్ కింద నమోదు చేసి బాధితుడికి న్యాయం చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు.



కిషోర్ మాక్‌వానాను కలసిన ఓబులేసు

తేనెలొలుకు భాష తెలుగు

పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో గురువారం గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వివిధ వేషధారణలో విద్యార్థులు అలరించారు.

- ఘనంగా తెలుగుభాషా దినోత్సవం
- వివిధ వేషధారణలో అలరించిన విద్యార్థులు
- తెలుగుభాష గొప్పదనాన్ని వివరిస్తూ ర్యాలీలు

పలమనేరు: తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. అనంతరం తెలుగుభాషపై పలు పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. తెలుగు విభాగాధిపతి వాసు, వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం పాల్గొన్నారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక ఉన్నత పాఠశాలల్లోనూ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు వందమంది పిల్లలకు తెలుగు పుస్తకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్‌తోపాటు పలు ప్రైవేట్ పాఠశాల్లో నిర్వహించారు.

ఘనంగా తెలుగు భాషాదినోత్సం

సదుం: తెలుగుభాషా దినోత్సవాన్ని స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి కవితకు భారత జాతీయ తెలుగు సమాఖ్య వారు మెమెంటో అందించి సత్కరించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, హెచ్ఎం జయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవహారిక భాషకు వారధి గిడుగు

బైరెడ్డిపల్లె: వ్యవహారిక భాషకు వారధి గిడుగు రామమూర్తి అని ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం అన్నారు. తెలుగుభాషా దినోత్సవాన్ని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గిడుగుకు నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో వివిధ వేషధారణల్లో విద్యార్థులు అలరించారు.

తెలుగుబాషకు సాటి మరొకటి లేదు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులకు బహుమతులను హెచ్ఎం నాగరాజరెడ్డి అందజేశారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అలరించారు. అదేవిధంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: నాగిరెడ్డిపల్లి ఎంపీయూపీ పాఠశాలలో గురువారం తెలుగు భాష, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గిడుగు రామమూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వేసిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా మదర్ థెరిసా పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని అట్టహాసంగా జరిగాయి. ప్రిన్సిపల్ డేవిడ్, కరస్పాండెంట్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని లైబ్రరీలో తెలుగుబాషా దినోత్సవాన్ని లైబ్రేరియన్ నసీబ్‌జాన్, రిటైర్డ్ అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. చంద్రమాకులపల్లెలో మాతృభాషా దినోత్సవాన్ని హెచ్ఎం శ్రీదేవి నిర్వహించారు. గూడూరుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం మహేష్‌నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించి, గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పులిచెర్ల మండలం కల్లూరు హైస్కూల్‌లో హెచ్ఎం శ్రీవాణి ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు జ్యోతి, వెంకట్రమణారెడ్డి, శైలజ, మంజునాథ్, సుజాత , పీడీ మురళీధర్‌తో పాటు కల్లూరు ఉపాధ్యాయులు దొరస్వామి, వెంకటసిద్దులు, రాజేంద్ర, ఈశ్వరయ్య, కిరణ్మయి, కట్టయ్య, అమృతవల్లి , రహమత్‌బాషా పాల్గొన్నారు.



కల్లూరు హైస్కూల్‌లో వివిధ వేషధారణలో విద్యార్థులు

వి.కోటలో..

వి.కోట: విద్యారంగంలో గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషిని మరువలేమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని నక్కనపల్లి ఉన్నత పాఠశాలలో ఆయన పాల్గొని గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈఓ చంద్రశేఖర్, ఎంఈఓ–2 మురుగేష్ పాల్గొన్నారు. చింతల ఎల్లాగరం ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్ కోఠారి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు.



పెద్దపంజాణి: గిడుగు, ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చింతలఎల్లాగరంలో విద్యార్థులు





చౌడేపల్లె: సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు



సదుం: వేణుగోపాల్ రెడ్డిని సన్మానిస్తున్న టీచర్లు



బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



పలమనేరు: లక్ష్మీనగర్‌లో తెలుగుభాషాదినోత్సవం



గూడూరుపల్లెలో..



పలమనేరు: ప్రశంసాపత్రాలను అందజేసిన తులసీనాథంనాయుడు,



పలమనేరు: డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం